# ఐ లవ్ యూ

## లవ్ లీ స్టోరీస్

''మధూ! స్పృహలో వుండే మాట్లాడుతున్నావా?'' దెబ్బతిన్న బెబ్బులిలా అరిచింది డాక్టర్ సునయన. ఆమె మొహం మండే అగ్నిగోళంలా ఎర్రగా కందిపోయింది. శరీరం విగురుటాకులా కంపించిపోవారంభించింది.

''స్పృహలో వుండే మాట్లాడుతున్నాను'' కర్కశంగా అన్నాడు మధు. ''నిన్ను ప్రేమించి పెళ్ళిచేసుకున్నందుకు నేను పొందిన సుఖం ఏమీ లేదు. నా ముందరికాళ్ళకు బంధాలు వేశావు. నాకు స్వాతంత్ర్యం లేకుండా చేశావు. చివరికి నేను పీల్చే గాలి మీద కూడా అధికారం చలాయించాలని చూశావు. ఐ హేట్ యూ.''

''బట్, ఐ లవ్ యూ మధూ!'' ఆక్రోశిస్తున్నట్టుగా అంది సునయన.

''నీ ప్రేమ నాకక్కర్లేదు. ఈ క్షణమే నేనీ ఇంట్లోంచి వెళ్ళిపోతున్నాను. మర్యాదగా విడాకులకు ఒప్పుకున్నావా సరేసరి. లేకపోతే విడాకులు ఎలా తీసుకోవాలో నాకు బాగా తెలుసు.''

సునయన విసురుగా లేచి అతని దగ్గరకొచ్చింది. ''అర్థమైంది! నీ చెవుల్లో విడాకుల మంత్రం మారిపోసింది ఎవరో నాకు తెలుసు. నీ కొత్త గర్ల్ ఫ్రెండ్ ప్రమీలేగా?''

''ఓ! అయితే ఆమె పేరు కూడా నీకు తెలిసిపోయిందన్న మాట! అవును, ప్రమీలను నేను ప్రేమిస్తున్నాను. నీ పీడ ఎంత త్వరగా విరగడైతే అంత త్వరగా ప్రమీలను పెళ్ళిచేసుకుంటాను.''

''ప్రేమ!'' ఫకాల్న నవ్వింది సునయన. ఆ నవ్వులో ఆవేశం, విషాదం, కసి అన్నీ సమపాళ్ళలో కలిసిపోయాయి. ''ప్రేమంటే నీకేం తెలుసు మధూ! తెలిసే వుంటే ఇంత నిర్దయగా మాట్లాడేవాడివే కాదు. నువ్వు నచ్చి స్వార్థపరుడివి. ఒకరిమీద మోజు తీరగానే మరొకరి కోసం పరిగెత్తే చపలుడివి. ఈ రోజు నేను. రేపు ప్రమీల. ఎల్లుండి ఇంకెవరో. నీ చంచల స్వభావానికి అంతంటూ వుందా మధూ?''

''అనవసరమైన మాటల్తో టైం వేస్టు చేయడం నాకిష్టం లేదు. విడాకులకు ఒప్పుకుంటావా లేదా?'' అసహనంగా అరిచాడు మధు..

''ఒప్పుకోను'' ఖచ్చితంగా చెప్పేసింది సునయన. ఆమె కళ్ళలో హఠాత్తుగా ఒక విధమైన కాఠిన్యం చోటుచేసుకుంది. ''ఒక్క విషయం బాగా గుర్తుంచుకో మధూ! నా వాళ్ళందర్నీ వదులుకొని నీ కోసం వచ్చాను. అంత వెలపోసి దక్కించుకున్న నిన్ను ఇంత సులభంగా జారవిడుచుకుంటాననుకోవడం నీ వెర్రి. విడాకులు తీసుకుంటావా? ఎలా తీసుకుంటావో నేనూ చూస్తాను. ప్రమీల పైపై మెరుగులే గొప్పవో నా ప్రేమే గొప్పదో నువ్వూ చూస్తావు. విడాకుల కోసం ప్రయత్నిస్తానన్నావుగా! వెళ్ళు, అలాగే ప్రయత్నించు. కానీ, చివరి గెలుపు నాదే.''

''అదీ చూస్తాను. గుడ్ బై'' అంటూ విసురుగా ఆ ఇంట్లోంచి బయటికి నడిచాడు మధు.

సునయన కాసేపు వెర్రిదానిలా అతను వెళ్తున్న వైపు కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయింది. తర్వాత తనలోని శక్తి అంతా ఆవిరైపోతున్న అనుభూతి కలగడంతో నిస్త్రాణవశిష్టలా ఓ సోఫాలో కూలబడిపోయింది.

బి.యస్.సి. చదివే రోజుల్లో ఆమెకు మధుతో పరిచయం కలిగింది. అతను కూడా బి.యస్.సి. చదువుతుండేవాడు అదే కాలేజీలో. ఆమె కంటే ఒక్క సంవత్సరం సీనియర్. అతనామెను సూదంటురాయిలా తీవ్రంగా ఆకర్షించాడు. బి.యస్.సి. పూర్తిచేశాక అతను ఎం.ఎస్.సి.లో చేరాడు. ఆమెకు మెడిసిన్‌లో సీటొచ్చింది. అయినా ఇద్దరి మధ్యా స్నేహం అలాగే కొనసాగింది. చివరికి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

ఎం.ఎస్.సి. తర్వాత పి.హెచ్.డి. చేసి అతను లెక్చరర్‌గా అపాయింట్‌మెంట్ తెచ్చుకున్నాడు. తను డాక్టర్‌గా ప్రాక్టీసు పెట్టింది. వాళ్ళ పెళ్ళికి ఇరువైపులా పెద్దవాళ్ళ నుంచి తీవ్రమైన అభ్యంతరం ఎదురైంది. ఆమె తనవాళ్ళందర్నీ వదిలేసి అతనికోసం వచ్చేసింది. అతను పెద్దల ఆస్తిలో తనకు రావల్సిన వాటా ఖచ్చితంగా రాబట్టుకుని వాళ్ళ నుంచి వేరుపడిపోయాడు. ఇద్దరూ రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేసుకున్నారు.

కాలక్రమేణా డాక్టరుగా ఆమె ప్రాక్టీసు పెరిగింది. సంపాదన లక్షల్లోకి చేరుకుంది. దాంతో ఆమె స్వంతంగా ఒక పెద్ద నర్సింగ్‌హోం కట్టించింది.

ఒక వైపు నుంచి డబ్బు ఎడతెరిపిలేకుండా వచ్చి పడుతుంటే మరో వైపు నుంచి ఆ డబ్బు మురికికాలవ గుండా కొట్టుకుపోయే మార్గాలు కూడా తెరుచుకుంటాయి. ఒకవైపు సునయన తన ప్రాక్టీసులో మునిగితేలుతుంటే మరోవైపు మధు దుర్వ్యసనాలు అలవాటు చేసుకున్నాడు.

సునయన సంపాయించే డబ్బు మీద అతనికెప్పుడూ అధికారం వుండేది. ఆ అధికారాన్ని దుర్వినియోగం చేయడం ప్రారంభించాడు. లెక్చరర్‌గా తనకొచ్చే జీతం ఒక్కరోజులో ఖర్చుపెట్టేసి మిగతా నెలంతా సునయన డబ్బుతో జల్సాలు చేయడం నేర్చుకున్నాడు.

సునయన మీద అతనికి మోజు ఎప్పుడో తీరిపోయింది. ఇప్పుడతని మోజంతా ఆమె డబ్బు మీదే. అలాంటి సమయంలో అతనికి పరిచయమైంది ప్రమీల. అతన్లో ఇలాంటి దురుద్దేశం

దాదా హయాత్

పుట్టించింది ప్రమీలేనని సునయనకు బాగా తెలుసు. మధు ప్రవర్తన శృతిమించడంతో తను అతనికి డబ్బందకుండా అష్టదిగ్బంధనం వేసింది. దాంతో అతని దృష్టి ప్రస్తుతం బ్యాంకులో తామిద్దరి పేరిటా ఉమ్మడిఖాతాలో వున్న డబ్బు మీద పడింది. విడాకుల పిటిషన్ దాఖలు వేశాక ఆ డబ్బంతా తనదే నని క్లెయిమ్ పెడతాడు.

చాలా సేపు అలా వేష్టలు దక్కి కూర్చుండిపోయిందల్లా సునయన గుండెల్లో ఒక జ్వాల భగ్గున మండినట్టనిపించింది. ప్రేమ అనేది ఎంత విచిత్రమైనది! అతను తనని ఇంతగా క్షోభపెట్టినా తన మనసుమాత్రం అతన్నే కోరుతోంది. ఒకరిపట్ల ఒకరికి నిర్హేతుకమైన అనురక్తి కలగడమే ప్రేమ కాబోలు!

మధు తన చెయ్యిదాటి పోతున్నాడు. అతన్ని తను వదులుకోలేదు. అందుకిప్పుడు ఒక్కటే మార్గం.

అవును, ఒక్కటే మార్గం!

ఆ నిర్ణయానికి రాగానే ఆమె గుండె రాయికంటే కఠినంగా మారిపోయింది.

★ ★ ★

రాత్రి రెండు గంటలైంది.

మధు పేకాట క్లబ్బులోంచి బయటికొచ్చాడు. క్రితం రోజు తనకొచ్చిన జీతంతో పేకాడి చాలా డబ్బు గెలుచుకున్నాడు. అదంతా ఈ రోజు పోగొట్టుకున్నాడు. అందుకతని మూడ్ ఏమాత్రం బాగోలేదు.

నగరంలోని ఒక మారుమూల ప్రాంతమది. చట్ట విరుద్ధంగా నడిచే పేకాట క్లబ్బులు అక్కడ చాలా ఉన్నాయి. వీధులన్నీ ఆ సమయంలో నిర్మానుష్యంగా వున్నాయి. అతను తల వంచుకుని నిరుత్సాహంగా ముందుకు నడుస్తున్నాడు. అంత రాత్రి పూట ఆటోలో దొరకవు. ప్రమీల ఇంటికి వెళ్ళాలంటే అయిదు కిలోమీటర్లు నడవాలి.

సునయనతో కలిసి ఉన్నప్పుడు ఈ ప్రాంతానికి కార్లో వచ్చిపోతుండేవాడు. సునయన గుర్తుకు రాగానే అతనికి ఒళ్ళు మండింది. తన సంతోషానికి ఆటంకాలు కల్పించిన రాక్షసి! కసిగా తిట్టుకున్నాడు.

అతను వీధి చివర మలుపు తిరిగి మెయిన్ రోడ్డు కేసి నడవనారంభించాడు. సరిగ్గా అదే సమయంలో ఆ రోడ్డుకి అవతలివైపు ఓ పక్కగా పార్కు చేసివున్న కారొకటి స్టార్టయి అతనివైపు వేగంగా దూసుకు రావారంభించింది.

కళ్ళలో ఒక్కసారిగా హెడ్‌లైట్ల కాంతి పడడంతో ఒక్క క్షణం పాటు అతను గుడ్డివాడైపోయాడు. దాంతో తన మీదికి దూసుకొస్తున్న కారుని గుర్తించలేకపోయాడు.

ఆ కార్లో డ్రైవింగ్ సీట్లో వున్నది సనయన.

★ ★ ★

అతను కళ్ళు తెరిచాడు.

ఒళ్ళంతా దిమ్మెక్కిపోయిన అనుభూతి. మెదడు మొద్దుబారి పోయినట్టుగా వుంది. మొదట ఏమీ గుర్తుకురాలేదు. అతి ప్రయత్నం మీద కారు హెడ్‌లైట్ల కాంతి మాత్రం గుర్తుకొచ్చింది అంతే. ఆ తర్వాత అంతా చీకటి. ఏదీ జ్ఞాపకం రావడం లేదు.

కళ్ళు తిప్పి తానెక్కడున్నాడో గుర్తించడానికి ప్రయత్నించాడు.

అది హాస్పిటల్!



ఈ కథ కోసం ప్రత్యేకంగా తీయించిన ఫోటో ఇది.
ఫోటోగ్రాఫర్: వై.ఎస్.ఎన్. మూర్తి.

తను హాస్పిటల్ బెడ్ మీద పడున్నాడు!

ఏమిటది?

తను హాస్పిటల్‌లో ఎందుకున్నాడు?

లేవడానికి ప్రయత్నించాడు.

కాళ్ళు తన స్వాధీనంలో వున్నట్టనిపించలేదు.

"లేవొద్దు మధూ! నీకు రెస్టు చాలా అవసరం."

అతను ఉలిక్కిపడి ఆ మాటలు వినిపించిన వైపు తల తిప్పి చూశాడు. ఎదురుగా సునయన కనిపించడంతో ఆశ్చర్యపోయాడు. ఆమె తన వంకే ప్రేమగా చూస్తోంది.

"నేనిక్కడికెలా వచ్చాను?"

"నువ్వు రాలేదు. నేనే తీసుకొచ్చాను" అందామె.

"ఎందుకు?"

"ఎందుకేమిటి? నీకు యాక్సిడెంటు జరిగింది. రెండుకాళ్ళకూ చాలా దెబ్బలు తగిలాయి. అయాం సారీ మధూ! గాయం విషమించడంతో ......"

అతనికి అకస్మాత్తుగా ఏదో అనుమానం వచ్చింది.

"ఏమైంది? గాయం విషమించడంతో ఏం చేశావ్?" అరిచినట్టుగా అడిగాడు. అతని గుండె దడదడలాడ నారంభించింది.

"గాయం విషమించడంతో నీ రెండు కాళ్ళూ తీసేయాల్సి వచ్చింది."

ఆమె చెప్పిందేమిటో మెదడులో ఇంకడానికి అతనికి కొద్దిసేపు పట్టింది.

"నో!" పిచ్చివాడిలా అరిచాడు.

సునయన చప్పున అతన్ని దగ్గరికి తీసుకుంది.

"మధూ... మధూ...! ఆవేశపడొద్దు" బుజ్జగిస్తున్నట్లుగా అంది. "నువ్విప్పుడు నా మీద ఆధారపడక తప్పదు. అయినా భయం లేదు. నిన్ను పసివాడిలా చూసుకుంటాను. కాళ్ళు పోయాయని తెలుస్తూనే నిన్ను వదిలిపెట్టి పోవడానికి నేను ప్రమీలని కాను. నువ్విప్పుడు పూర్తిగా నా వాడివి. యూ నో మధూ? ఐ లవ్ యూ... ఐ లవ్ యూ వెరీ మచ్!"


# ఆదివారం

రాజకీయ వారపత్రిక

## ఎటెన్షన్ ప్లీజ్

డియర్ రీడర్స్!

మీ కోసం "ఆదివారం రాజకీయ వారపత్రిక" ప్రత్యేకమైన కొన్ని శీర్షికలు నిర్వహిస్తోంది.

### 1. నాకు నచ్చిన నాయకుడు/నాయకురాలు.

మీకెంతో ఆదర్శవంతంగా అనిపించే రాజకీయ నాయకుడు/నాయకురాలు గురించి మీ అమూల్య అభిప్రాయాలను మీ ఫోటోతో పాటు పంపించగలరు.

### 2. జాబ్ ప్లీజ్

మీరు నిరుద్యోగులైతే మీ అర్హతలు, మీరు కోరుకునే ఉద్యోగం, మీ చిరునామాతో పాటు ఫోటో కూడా పంపించడం మర్చిపోకండి.

### 3. మా ఊరి గొప్పతనం

మీ ఊరి గొప్పతనం, చారిత్రాత్మక విశిష్టత, వింతలు విశేషాలతో రెండు అరఠావులు మించకుండా ఫోటోతో పాటు పంపించండి. ప్రచురిస్తాము.

### 4. కథలకు ఆహ్వానం

చక్కని శైలిలో మంచి ఇతివృత్తం గల సామాజిక స్పృహతో, శృతిమించని శృంగారంతో మినీ కథలు (నాలుగు పేజీలు) పెద్ద కథలు (పది పేజీలు) పంపించండి.

పూర్తి వివరాలకు మార్కెట్‌లో వున్న "ఆదివారం రాజకీయ వారపత్రిక"ను చూడండి.

మీ రచనలు పంపవల్సిన చిరునామా:

ఎడిటర్

ఆదివారం రాజకీయ వారపత్రిక

5–8–55/ఏ,

నాంపల్లిస్టేషన్ రోడ్,

హైదరాబాద్–500 001.